క్లుప్తంగా

నోట్ పుస్తకాల వితరణ



నోట్ పుస్తకాలను చూపుతున్న విద్యార్థులు

బెళుగుప్ప: మండల పరిధిలోని జీడిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అనంతపురం ఏజీఎస్ ఎడ్యుకేషన్ ఆర్గనైజేషన్ వారు బుధవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. హెచ్ఎం గోపాలకృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏజీఎస్ సంస్థ వ్యవస్థాపకుడు ఏజీ శ్రీనివాసరెడ్డి సతీమణి ఏజీ ప్రమీలమ్మ పాల్గొని నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ప్రథమ శ్రేణి విద్యార్థులందరికీ డిక్షనరీలు, ప్యాడ్స్ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీరెడ్డి, ఫకృద్దీన్, పెన్నోబులేసు, సరస్వతి, ప్రకాశ్ పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించండి



ర్యాలీలో పాల్గొన్న విద్యాశాఖ అధికారులు

కళ్యాణదుర్గం రూరల్: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈఓ విజయ్ కుమారి, బాబు తల్లిదండ్రులను కోరారు. బడికి పోతాం కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని దేవీరమ్మ కాలనీలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బడి మానేసిన విద్యార్థుల ఇంటికి వెళ్లి వారి తల్లిదండ్రులకు చదువుకోవటంతో కలిగే ఉపయోగాలను తెలియజేశారు. మున్సిపల్ కమిషనర్ నరసారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కూడేరు: ప్రైవేటు పాఠశాలలను ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తే సీజ్ చేస్తామని మండల విద్యాధికారి చంద్రశేఖర్ హెచ్చరించారు. బుధవారం ఆయన తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం యూనిఫాం, పాఠ్య, నోట్ పుస్తకాలను విద్యార్థులకు విక్రయించకూడదన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లల తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు అందితే ఉపేక్షించేది లేదన్నారు. ప్రభుత్వ నిబంధలనకు అనుగుణంగా పాఠశాలలను నిర్వహించుకోవాలని సూచించారు.

ఫ్యాక్టరీలతో రైతులకు అన్యాయం



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు గ్రామ పరిధిలో ఉండే స్పాంజ్, ఐరన్ ఫ్యాక్టరీల వల్ల రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగార్జున ఆరోపించారు. బుధవారం ఫ్యాక్టరీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న పంట పొలాలను స్థానిక రైతులతో కలిసి పరిశీలించారు. ఈ ఫ్యాక్టరీల పొల్యూషన్‌తో పంట పొలాలు దెబ్బతింటున్నా పరిహారం ఇవ్వడంలో ఫ్యాక్టరీ యజమాన్యం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఫ్యాక్టరీల వద్ద రోడ్లు సక్రమంగా లేవని, సీసీ రోడ్లు వేయాలని రైతులకు ఎకరాకు రూ.30 వేలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఇలాగే నిర్లక్ష్యం చేస్తే కలెక్టరేట్ ముట్టడించి రైతుల కోసం తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సీపీఐ నాయకులు గౌస్, అంజి, కొట్రేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ సజావుగా జరగాలి



రేషన్ డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ చిట్టిబాబు

రాయదుర్గం రూరల్: రేషన్‌కార్డులున్న ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం అందించే నిత్యావసర సరుకులు సజావుగా పంపిణీ చేయాలని తహసీల్దార్ చిట్టిబాబు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని తన చాంబర్లో సీఎస్ డీటీ సుదర్శనాచారితో కలిసి బుధవారం చౌక ధాన్యపు డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్డుదారులకు సరైన తూకంతో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. వర్షాకాలం సందర్భంగా చౌకధాన్యపు షాపుల్లోని సరుకులు నానకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి కార్డుదారుడికి నిత్యావసరాలు అందాలని, లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



కణేకల్లులో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు



గుమ్మఘట్ట: ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అధికారులు



కళ్యాణదుర్గంలో విద్యార్థుల మానవహారం

కణేకల్లు: యువకులు, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కణేకల్లు సెబ్ సీఐ మురళీకిశోర్, కణేకల్లు ఎస్ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. కణేకల్లులో బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని సెబ్, సివిల్ పోలీసులు కాలేజీ విద్యార్థులు, లెక్చరర్లతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ కాలేజీ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం విద్యార్థులు, అధికారులు మానవహారంగా ఏర్పడి మత్తుపదార్థాలకు దూరంగా ఉంటామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ ప్రసాద్‌రావు, ఏఎస్ఐ శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రాయదుర్గంటౌన్: ఉజ్వల భవిష్యత్తు కోసం మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని పట్టణ సీఐ శ్రీనివాసులు, సెబ్ సీఐ మురళీమోహన్ సూచించారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సెబ్, పోలీసుశాఖల ఆధ్వర్యంలో కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. తొలుత డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో అవగాహన సమావేశం నిర్వహించారు. అనంతరం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద నుంచి వినాయక సర్కిల్ వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కొందరు విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసై బంగారు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నట్లు చెప్పారు. మత్తు పదార్థాల బారిన పడకుండా బాగా చదువుకొని ఉన్నతస్థానాల్లో స్థిరపడాలని సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనూ ప్రిన్సిపాల్ వీరేష్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.

గుమ్మఘట్ట: యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా దూరంగా ఉండాలని ఎస్ఐ వెంకటేశ్వర్లు సూచించారు. మండల కేంద్రంలోని గుమ్మఘట్టలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించి గ్రామంలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల జోలికి వెళ్లి జీవితాలను బుగ్గిపాలు చేసుకోరాదని ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 రామచంద్ర, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరవకొండ (విడపనకల్లు): యువత, విద్యార్థులు డ్రగ్స్ బారిన పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఉరవకొండ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ ఖాజాహుసేన్ సూచించారు. బుధవారం విడపనకల్లులో అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సెబ్ సీఐ మాట్లాడుతూ.. యువత, విద్యార్థుల జీవితాలు డ్రగ్స్‌కు దూరంగా ఉంటే వారి జీవితాలు బంగారుమయం అవుతాయన్నారు. మత్తుకు బానిస అయితే మరణానికి దగ్గరవుతారన్నారు. కార్యక్రమంలో సెబ్ సీఐ కిషోర్, ఉరవకొండ సెబ్ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ నాయక్ పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: విద్యార్థి దశ నుంచి మంచి అలవాట్లు అలవరుచుకోవాలని సివిల్ జడ్జి సుభాన్ సూచించారు. బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా పట్టణంలోని కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వాడకంతో జరిగే నష్టంపై జడ్జి సుభాన్ తెలియజేశారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ ఉంచాలని, తద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ హరినాథ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: మాదకద్రవ్యాల వాడకం వల్ల జీవితాలు నాశనమవుతాయని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జయరాం, పట్టణ సీఐ హరినాథ్, సెబ్ సీఐ వెంకట్ హెచ్చరించారు. బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఎస్వీజీఎం డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వాడకం వల్ల జరిగే నష్టంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ సర్కిల్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రవిశంకర్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంబదూరు: మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సెబ్ సీఐ టక్కీబాషా, ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం మాదకద్రవ్యాల అంతర్జాతీయ వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. మాదకద్రవ్యాలు వినియోగించడంవల్ల జరిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ వెంకటరత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

కుందుర్పి: మాదక ద్రవ్యాల వాడకం అతి ప్రమాదకరమని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల వాడకంతో జరిగే అనర్థాలపై విద్యార్థులకు కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ అక్కులన్న, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఉమామహేశ్వర్‌లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



విడపనకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



రాయదుర్గం: మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు



కంబదూరులో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



కళ్యాణదుర్గం: మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి సుభాన్

డయేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోండి



కైరేవులో తాగునీటి నాణ్యతను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

బ్రహ్మసముద్రం: డయేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని మండల వైద్యాధికారి రాజేష్ కుమార్, తహసీల్దార్ ఈశ్వరయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో బుధవారం వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో డయేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ముఖ్యంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. దోమలు నిల్వ ఉండకుండా ముందస్తుగా మందు పిచికారీ చేయాలన్నారు. ఎంపీడీఓ దాసా నాయక్, ఎంఈఓ ఓబుళపతి, సూపర్‌వైజర్లు రామాంజినమ్మ, ఖాసీంబీ తదితరులు పాల్గొన్నారు.

శెట్టూరు: డయేరియా విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రజలు సురక్షిత నీటినే తాగాలని వైద్య సిబ్బంది కోరారు. బుధవారం కై రేవు, చెర్లోపల్లి, యాటకల్లు, చిన్నంపల్లి గ్రామాలలో వైద్య సిబ్బంది పర్యటించారు. ఆయా గ్రామాల్లో మురుగునీటి గుంతలు, అపరిశుభ్ర ప్రదేశాలను గుర్తించి శుభ్రం చేయించారు. తాగునీటి నాణ్యతను పరిశీలించారు. అనంతరం పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించి పిల్లలకు తగు సూచనలు చేశారు. కలుషిత తాగునీరు, ఆహారం ఉపయోగించడం వల్ల డయేరియా ప్రబలుతుందన్నారు.కార్యక్రమంలో పీహెచ్ఎన్ సరోజమ్మ, సూపర్‌వైజర్ లీలావతి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి మతిస్థిమితంలేని మహిళ



తాడిపత్రిలోని జీవనాలయం నిర్వాహకులకు బాలికను అప్పగించిన దృశ్యం

కణేకల్లు: మతిస్థిమితం లేని ఓ మహిళను అనాథాశ్రమంలో చేర్పించారు పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు. వివరాల్లోకెళితే... కణేకల్లుకు చెందిన ఆసిఫాబాను (34)కు కొన్నేళ్ల క్రితం పెళ్లి అయింది. భర్త చనిపోగా ఎవరూ లేక ఆమె మానసిక పరిస్థితి దెబ్బతింది. తెలిసిన వారు మానసిక ప్రభుత్వాస్పత్రుల్లో చేర్పించగా... కొంత నయంకాగా ఆమె కణేకల్లుకు వచ్చింది. కొద్ది రోజులకే ఆమె పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. కణేకల్లులో గత నాలుగు రోజులుగా తనలో తానే మాట్లాడుకుంటూ నగ్నంగా తిరగడంతో ప్రజలు కూడా ఆందోళన చెందారు. విషయాన్ని కణేకల్లు ఎస్ఐ శ్రీనివాసులతో పాటు ఐసీడీయస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తాడిపత్రిలోని జీవనాలయం అనాథలతో పాటు మానసికరోగులకు ఆశ్రయం కల్పిస్తున్న విషయాన్ని తెలుసుకొన్న ఎస్ఐ వారితో మాట్లాడారు. ఆసిఫాభానును పోలీసుల సాయంతో తాడిపత్రిలోని జీవనాలయంలో చేర్పించారు. జీవనాలయం నిర్వాహకులు ఆమెను అక్కున చేర్చుకున్నారు. ఆమెపై పట్ల శ్రద్ధ కనబరిచి అనాథశ్రయంలో చేర్పించిన అధికారులకు కణేకల్లు వాసులు వ్యాట్సాఫ్ చెప్పారు.

రేపటి నుంచి జమాలుద్దీన్ ఖాద్రీ ఉరుసు



ఉరవకొండ: స్థానిక జామీయా మసీదు వద్ద ఉన్న ప్రసిద్ధి చెందిన హజరత్ సయ్యద్‌షా జమాలుద్దీన్ ఖాద్రీ తాసీర్ దర్గా 34వ ఉరుసు ఉత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 28 నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు సయ్యద్ అజ్మతుల్లా హుసేనీ, సయ్యద్ తఖీబాబా, సయ్యద్ తాసీర్‌బాబా స్వామి ఆశీస్సులతో భక్తులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 28న గంధం వేడుకలు దర్గా ఆవరణ నుంచి పట్టణ పురవీధుల గుండా మేళతాళల మధ్య ఊరేగింపు నిర్వహించి అనంతరం దర్గాకు చేర్చుతారు. 29న ఉరుసు ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. 30న స్వామి జియారత్ వేడుకలతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉరుసు ఉత్సవాలకు జిల్లా నలమూలల నుంచే కాక కర్ణాటక నుంచి కుడా భక్తులు తరలిరానున్నారు.



దర్గాలోని స్వామి సమాధి

ట్యాంకులను శుభ్రం చేయించాలి



మాట్లాడుతున్న ఈఓఆర్‌డీ మాధవరెడ్డి

బెళుగుప్ప: మండల పరిధిలో ఉన్న తాగునీటి ట్యాంకులను పంచాయతీ కార్యదర్శులు ప్రతి పది రోజులకు ఒకసారి తప్పనిసరిగా శుభ్రం చేయించాలి. క్లోరినేషన్ కూడా చేపట్టాలని ఈఓఆర్‌డీ మాధవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని అంకంపల్లి, రామసాగరం, తగ్గుపర్తి తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన తాగునీటి ట్యాంకులను పరిశీలించారు. అపరిశుభ్రతను తొలగించాలని పంచాయతీ అధికారులకు సూచించారు. గ్రామాల్లో దోమల తీవ్రతను తగ్గించడానికి మురుగు గుంతలు, కాలువల వద్ద అబేట్ ద్రావణం పిచికారీ చేయించాలన్నారు. గ్రామాల్లో తప్పనిసరిగా ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. ప్రతి పది వేల లీటర్ల తాగునీటికి 40 గ్రాముల బ్లీచింగ్ ఫౌడర్‌తో క్లోరినేషన్‌కు వినియోగించాలన్నారు. ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లోని అధికారులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. లేకుంటే చర్యలు తప్పవని పేర్కొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



ఎస్.హనుమాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కణేకల్లు: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని మలేరియా సబ్‌యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని ఎస్.హనుమాపురం గ్రామంలో బుధవారం 'మలేరియా వ్యతిరేక మాసోత్సవం'పై విద్యార్థులు, ఆరోగ్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన సభలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమకాటుతో వచ్చే జ్వరాలు ప్రాణాంతకంగా మారే అవకాశముందన్నారు. జ్వరం, టైఫాయిడ్, వైరల్ ఫీవర్, మలేరియా, చికన్ గున్యా, డెంగీ లాంటి జ్వరాలొచ్చే అవకాశముందన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొంటే జ్వరాల బెడద ఉండదన్నారు. దోమలు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో అభివృద్ధి చెందుతాయని ఇళ్ల వద్ద అనవసర నీటి నిల్వలు ఉంచకూడదన్నారు. చలి, జ్వరం, చెమటలు పట్టి జ్వరం వదిలి మళ్లీ రావడం మలేరియా లక్షణాలని చెప్పారు. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, స్కూల్ హెచ్ఎం రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో కళాశాల పూర్వ విద్యార్థులు

ఉరవకొండ: స్థానిక ఎస్‌కే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2022–24 విద్యా సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు కళాశాల 1987–89 బ్యాచ్ పూర్వ విద్యార్థులు బుధవారం నగదు బహుమతులు అందజేశారు. ఇంటర్ బాలుర కళాశాల పరిధిలో మహ్మద్ ఖలీద్ (ఎంపీసీ) హరికృష్ణ (బైపీసీ), ఇంటర్ బాలికల కళాశాల పరిధిలో హబీబా (బైపీసీ) రంజిత (ఎంపీసీ)కు రూ.5 వేల చొప్పున అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మమత మాట్లాడుతూ.. కళాశాలలో మంచి మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేయడం అభినందనీయమన్నారు. 1987–89 బ్యాచ్ పూర్వ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో 1987–89 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సాకే భాస్కర్, శశికళదేవి, మాధవిలత, వెంకట్, కృష్ణమూర్తి, రామాంజినేయులు, విశ్వరూపచారి, భీమలింగ చేతుల మిదుగా నగదు పోత్సాహకాలు అందజేశారు.

బాల్య వివాహాలపై అవగాహన



మాట్లాడుతున్న తహసీల్దార్ రామాంజినమ్మ

బొమ్మనహాళ్: మండల కేంద్రమైన బొమ్మనహాళ్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో బుధవారం బాల్య వివాహాలు, సంక్షేమం, గృహ హింస చట్టాలపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, బొమ్మనహాళ్ తహసీల్దార్ రామాంజినమ్మ మాట్లాడుతూ బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుంటామన్నారు. బాల్య వివాహాలను అరికట్టడంతో ప్రతి ఒక్కరూ భాగ్యస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాలికలు బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ఇళ్లలో ఏమైనా సమస్యలుంటే ఉపాధ్యాయుల దృష్టికి , పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. లేదా టోల్‌ఫ్రీ నంబర్ 1098కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘునాథ్, ఎస్ఐ శ్రీనివాసులు, ఎంఈఓలు వీరన్న, మల్లికార్జున, కేజీబీవీ ప్రిన్సిపాల్ కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం



రాగులపాడులో పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

వజ్రకరూరు: మండలంలోని రాగులపాడు గ్రామంలో బుధవారం ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ.. 90 శాతం కచ్చితత్వంతో పెయ్య దూడల పుట్టుకకు లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమంగా గర్భధారణ పథకంపై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. గ్రామంలోని అన్ని పశువులను పరీక్షించేందుకు ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రూ.1,350 విలువైన రెండు సూదులను రూ.500 లకే అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. రూ.850 రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశులు, పశువైద్యాధికారి కృష్ణమూర్తి నాయక్, పశుసంవర్ధక సహాయకులు భద్రు నాయక్, వెంకటేష్, మస్తాన్, పెన్నోబుళేసు, రఫి తదితరులు పాల్గొన్నారు.

శుభ్రత లేకపోతే హోటళ్లు సీజ్ చేస్తాం



పదార్థాలను బయటపెట్టి విక్రయిస్తుండడంపై హెచ్చరిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ జగదీష్

రాయదుర్గంటౌన్: పట్టణంలోని పలు హోటళ్లపై మున్సిపల్ అధికారులు కొరడా ఝులిపించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు, డయేరియా ప్రబలుతున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులు చర్యలకు సిద్ధమయ్యారు. మున్సిపల్ కమిషనర్ కిశోర్ ఆదేశాల మేరకు బుధవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ జగదీష్, పారిశుద్ధ్య మేస్త్రీలు, సచివాలయ శానిటరీ సెక్రటరీలు సంయుక్తంగా హోటళ్లపై దాడులు చేశారు. శుభ్రత, నాణ్యతను పరిశీలించి పలువురు యజమానులను హెచ్చరించారు. అపరిశుభ్రంగా ఉన్న నటరాజు హోటల్, శక్తి హోటల్‌తో మరికొన్ని హోటళ్ల యజమానులకు అపరాధ రుసుం విధించారు. కచ్చితంగా హోటళ్లలో శుభ్రత పాటించాలని, ప్యూరిఫైడ్ వాటర్ ఇవ్వాలని, తిను పదార్థాలను బయట పెట్టి విక్రయిస్తే హోటళ్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

హోటళ్ల తనిఖీ

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని పలు హోటళ్లలో బుధవారం ఆహార భద్రతాధికారి రామచంద్ర తనిఖీ చేశారు. హోటళ్లలోని వంటగదిని పరిశీలించి నాణ్యత లేని తొమ్మిది హోటళ్లు, ఒక దాబా యజమానికి నోటీసు ఇచ్చారు. ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించకుంటే కఠిన చర్యలు తప్పవని హోటల్ యజమానులను హెచ్చరించారు.